కేడీఎం పేరుతో మాయాజాలం

- జీఎస్టీ అంటూ నిలువుదోపిడీ
- నకిలీ హాల్‌మార్క్‌తో బంగారు ఆభరణాల అమ్మకం
- వినియోగదారులను నిండా ముంచుతున్న పలువురు..



మణుగూరురూరల్: బంగారం విక్రయాల మాటున మణుగూరు పట్టణంలో కొంతమంది వ్యాపారస్తులు వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. కేడీఎం.. జీఎస్టీ అంటూ.. అందిన కాడికి దోచుకుంటున్నారు. మేలిమి బంగారంతో మీకు నచ్చిన డిజైన్లలో ఆభరణాలు చేయడం మా ప్రత్యేకత అంటూ మాయ మాటలు చెబుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. అంతేకాకుండా వివిధ రకాల ప్రచారాలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. బంగారం వ్యాపారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసే వారే లేకపోవడంతో వారి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

24 కాదు.. 22 క్యారెట్లే..

అచ్చమైన మేలిమి(కేడీఎం) బంగారం అంటూ మాయమాటలతో బంగారం వ్యాపారస్తులు వినియోగదారులను నిండా ముంచుతున్నారు. బీఐఎస్ నిబంధనల ప్రకారం 24 క్యారెట్ల బంగారాన్ని మేలిమి బంగారంగా నిర్ధారించగా.. 22 క్యారెట్ల 91.6 బంగారాన్ని స్వచ్ఛమైన బంగారంగా గుర్తించడం జరుగుతుంది. 24 క్యారెట్ల బంగారంతో బంగారు ఆభరణాలను తయారు చేయడం సాధ్యం కాదు. 22 క్యారెట్ల బంగారంతో ఆభరణాలు తయారు చేయవచ్చు. కానీ ఈ బంగారంతో ఆభరణాలు తయారు చేసేటప్పుడు రెండు వంతుల రాగి, జింక్ వంటివి కలుపుతారు. కాగా బంగారం వ్యాపారస్తులు 22 క్యారెట్ల బంగారంతో తయారు చేసే ఆభరణాలనే 24 క్యారెట్లుగా వినియోగదారులకు పేర్కొంటూ.. ధర వసూలు చేస్తున్నారు. దీనికి తోడు తరుగు, మజూరీలతో మరో రూపంలో వినియోగదారులను కొందరు వ్యాపారులు దగా చేస్తున్నారు.

ఎస్టిమేటెడ్ బిల్లుతో జీఎస్టీ వసూలు

జీఎస్టీ పేరుతో బంగారం వ్యాపారులు వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా బంగారు ఆభరణాలను తయారు చేసే కేంద్రాలు లేవు. స్థానిక వ్యాపారులు వినియోగదారుల నుంచి తీసుకున్న ఆర్డర్లను హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లో తయారు చేయించి జీఎస్టీ చూపకుండానే జీరో పద్ధతిలో విక్రయాలు సాగిస్తున్నారు. వ్యాపారస్తులు మాత్రం జీఎస్టీ చెల్లించకుండానే బంగారు ఆభరణాల సరఫరా, విక్రయాలు సాగిస్తున్నారు. బంగారు దుకాణాల్లో ఉండే అసలైన బిల్లులు కాకుండా ఎస్టిమేటెడ్ బిల్లులో జీఎస్టీ కలిపి వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. ఇలా జీఎస్టీ పేరుతోనే కాకుండా మంజూరు, తరుగు అంటూ వ్యాపారస్తులు వినియోగదారులను మోసగిస్తూ అడ్డంగా దోచుకుంటున్నారు.

నకిలీ హాల్‌మార్క్‌తో అమ్మకాలు

హాల్‌మార్కింగ్ అనేది బంగారం స్వచ్ఛతను గుర్తించే విధానం. బంగారు ఆభరణాలపై బీఐఎస్ ముద్ర ఉంటుంది. హాల్ మార్కింగ్ ఉన్న నగలు, బంగారాన్ని కొనుగోలు చేయాలని, ప్రతీ దుకాణంలో ఈ విధానం అమలు చేయాలనే నిబంధన ఉంది. అయినా కొంతమంది వ్యాపారస్తులు నకిలీ హాల్‌మార్క్ పేరుతో బంగారు ఆభరణాలను విక్రయిస్తూ దందా సాగిస్తున్నారు. నాణ్యత, స్వచ్ఛత లేని బంగారు ఆభరణాలను తయారు చేసి వినియోగదారులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారులు స్పందించేనా..?

బంగారం విక్రయాలపై సంబంధిత కమర్షియల్ ట్యాక్స్, బంగారం నాణ్యత, స్వచ్ఛతలను పరిశీలించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే బంగారం వ్యాపారస్తుల అక్రమాలు మితిమీరుతున్నాయని స్థానికంగా పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. నకిలీ హాల్‌మార్క్‌తో మోసం చేస్తున్న వ్యాపారస్తులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.1.73 కోట్లతో షావెల్ ప్రారంభం



జెండా ఊపి షావెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్, అధికారులు

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ ఎస్అండ్‌డీ సెక్షన్‌లో.. రూ.1.73కోట్ల వ్యయం గల, 3 క్యూబిక్ మీటర్ల బకెట్ సామర్థ్యం కలిగిన బ్యాస్ హెచ్ఓఈ డీజిల్ షావెల్‌ను కలిగిన షావెల్‌ను ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏరియా లక్ష్యాల సాధన కోసం యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసచారి, రమేశ్, రామకృష్ణ, బైరెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భాస్కర్‌రావు, కిషన్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణం రాజు, ఫిట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటూ జీఎం శ్యామ్‌సుందర్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సింగరేణీయులు, వారి కుటుంబ సభ్యులు, పురజనులు భారీ ఎత్తున హాజరయ్యే అవకాశం ఉందని, వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. తినుబండారాల స్టాళ్లను నెలకొల్పాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాటు చేసుకోదలచిన వారు ఈ నెల 31వ తేదీ లోపు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా డీజీఎం (పర్సనల్) రమేశ్, సీనియర్ పీఓలు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు, డీవైఎస్ఈ(సివిల్) ప్రవీణ్ కుమార్, సర్వే అధికారి సర్వర్ నబీ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి



ఆశ్రావున్‌ను శాలువాతో సత్కరిస్తున్న సంస్థ జిల్లా అధ్యక్షురాలు, సభ్యులు

కరకగూడెం: సమాజ శ్రేయస్సు కోసం 'దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్'కృషి చేస్తోందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం మండల కేంద్రంలో సంస్థ మండల అధ్యక్షురాలు ఆశ్రావున్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. సమాజంలో హింస, వివక్ష, దోపిడీకి గురైన వారికి రక్షణ కల్పించడం, పేదలకు, వృద్ధులకు, పిల్లలకు, మహిళలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి, న్యాయ సహాయం అందించడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. చాలా మంది మహిళలకు తమ ప్రాథమిక హక్కులు, చట్టపరమైన రక్షణలు తెలియడంలేదని, వారికీ ఆ హక్కుల గురించి అవగాహన కల్పించడం ద్వారా అన్యాయాలను ఎదుర్కోవడానికి, న్యాయం పొందడానికి ధైర్యం పొందుతారని అభిప్రాయపడ్డారు. అనంతరం సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న సంస్థ మండల అధ్యక్షురాలు ఆశ్రావునును శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆరిఫా, మణుగూరు మండలం ప్రెసిడెంట్ అనిత, భద్రాచలం ప్రెసిడెంట్ ప్రవంతి పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టాల కోసం ధర్నా



డీఎఫ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న సతీష్, గ్రామస్తులు

దుమ్ముగూడెం: ఆర్ఓఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ అయ్యి, సర్వే నంబర్లు కూడా వచ్చిన గడ్డోరిగట్టు గ్రామ ప్రజల పోడుభూములకు పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఫారెస్ట్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీఎఫ్ఓకు వినతిపత్రం అందజేశారు. మండలం చిన్నబండిరేవు పంచాయతీ గడ్డోరిగట్టు గ్రామంతో తాము 2005 కంటే ముందు అటవీహక్కుల చట్టం ప్రకారం పోడుభూములు కొట్టుకొని వ్యవసాయం చేస్తున్నట్లు డీఎఫ్ఓకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ.. గడ్డురుగట్టు గ్రామ ఆదివాసీ ప్రజలు పోడు సాగు చేసుకుంటున్న క్రమంలో ఫారెస్ట్ అధికారులు వాచర్లతో రాత్రిపూటలో టేకు చెట్లను నరికించి.. ఆదివాసుల పై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. నరసింహారావు, జోగారావు, సింధు, రమాదేవి, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా ఆటోలు నడిపితే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న సీఐ నాగబాబు

మణుగూరురూరల్: రహదారిపై అడ్డదిడ్డంగా ఆటోలను నడిపితే చర్యలు తప్పవని మణుగూరు సీఐ పాటి నాగబాబు హెచ్చరించారు. గురువారం మణుగూరు పట్టణ ప్రధాన కూడళ్లను పరిశీలించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రయాణికుల పట్ల అగౌరవంగా, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, మత్తు పదార్థాల రవాణాకు పాల్పడినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ సూచనల మేరకు ఎస్సై మేడ ప్రసాద్, ట్రైనీ ఎస్సై మనీషాలు సిబ్బందితో కలిసి అంబేడ్కర్ సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బుటారి రాజు టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. టీపీటీఎఫ్ సమాజ శ్రేయస్సు, విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా, కామన్ స్కూల్ సిస్టం కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి, వి.ముత్తయ్య, పి.రాంబాబు, ఎం.సత్తెమ్మ, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

మణుగూరురూరల్: స్థానిక సంస్థల ఎన్నికలను త్వరగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని, పంచాయతీల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేర్పుల సురేష్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అక్కి నర్సింహారావు, సీనియర్ నాయకులు ఎడవల్లి వెంకటయ్య, తాతా రమణ, వడ్లూరి రాంబాబు, కంభంపాటి శ్రీను, దాసరి వెంకన్న, యూత్ మండల అధ్యక్షుడు బోశెట్టి రవిప్రసాద్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు డేగల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీలో ఉన్న సింగరేణి ఏరియా ఆస్పత్రి క్యాజువాలిటీలో వసతులు కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీకేఓసీ పీఓ, యాక్టింగ్ జీఎం టి.లక్ష్మీపతిగౌడ్‌కు టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలోని బెడ్స్‌పై పరుపులు పాడవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీహెచ్‌పీ నుంచి దుర్గా క్యాంప్ వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన యాక్టింగ్ జీఎం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సెంట్రల్ కమిటీ నాయకులు బంగారి పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ఫిట్ కార్యదర్శులు ఇమ్రాన్, నరేష్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే బాసట



ఎమ్మెల్యే జారె పర్యవేక్షణలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బాసటగా నిలిచారు. బాధితులను స్వయంగా తన కారులో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక వైద్యం అందేలా చూశారు. ములకలపల్లి మండలపరిధిలోని పాతగంగారంకు చెందిన కోండ్రు వెంకటేశ్ భార్య రత్నాలమ్మ, కుమారుడు జోసెఫ్‌తో కలసి ద్విచక్ర వాహనంపై జగ్గారం గ్రామంలో పెళ్లికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా.. గంగారం అటవీప్రాంతంలో బైక్ యాక్సిడెంట్ జరిగింది. ప్రమాదంలో వెంకటేశ్ కాలుకి తీవ్రగాయంకాగా, ఘటనాస్థలిలోని కుప్పకూలిపోయాడు. అదేసమయంలో పాల్వంచ నుంచి స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గండుగులపల్లికి వెళుతున్నారు. ప్రమాద విషయన్ని గమనించి, క్షతగాత్రులతో మాట్లాడారు. తన వాహనంలో హుటాహుటిన మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్ ఆస్పత్రికి చేరుకున్నారు. నడవలేని స్థితిలో ఉన్న బాధితుడిని కుర్చీలో మోసుకుంటూ ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే జారె పర్యవేక్షణలో స్థానిక వైద్యాధికారి కృష్ణదీపక్ రెడ్డి, ఏఎన్ఎం భారతి వైద్య చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాడి తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్, కటికనేని ఆదిత్య తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

గుండాల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో మండలంలోని వ్యాపారులు నకిలీ విత్తనాలు, పురుగుమందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ వెంకటరమణ, సీఐ రవీందర్‌లు అన్నారు. మండల కేంద్రలో గురువారం ఎరువులు, పురుగుమందు షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను రిజిస్టర్లను, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించి మోసాలకు పాల్పడ కూడదని, డేట్ ఉన్న పురుగుమందులు అమ్మాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి బిల్లులు తీసుకోవాలని అన్నారు. బయట నుంచి నకిలీ విత్తనాలు తీసుకువచ్చిన వారి సమాచారం తమకు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సై సైదా రహూఫ్, ఏఈఓలు లెనిన్, బాలరాజు ఉన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం



బూర్గంపాడు: జీలుగు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ తాతారావు

చండ్రుగొండ: మండలంలోని గానుగపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీని సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు గురువారం ప్రారంభించారు. జీలుగులతోపాటు వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. 30 కేజీల ధర రూ. 2137లు, వరి విత్తనాలు 25 కేజీల ధర రూ. 1075 ఉందన్నారు. అవసరం ఉన్న రైతులు వ్యవసాయ శాఖ నుంచి టోకెన్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. సీఈఓ లంకా నర్సింహారావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బూర్గంపాడు: బూర్గంపాడు పీఏసీఎస్‌లో గురువారం రైతులకు రాయితీపై జీలుగు విత్తనాల విక్రయాలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తాతారావు ప్రారంభించి మాట్లాడారు. మాగాణి భూములలో రైతులు జీలుగులు, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చాన్నారు. పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం



చర్ల: ప్రచార జాతా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజు

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం/చర్ల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాను నిర్వహించారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలంలో సీనియర్ నాయకులు పి.లక్ష్మి నారాయణ గారు లక్ష్మీనారాయణ, బి.మురళీమోహన్, ఎస్. కృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, డి.తావుర్య, ఎస్.శైలజ, ఎస్.విజయ కుమార్, ఎమ్.సత్య నారాయణ, ప్రసాద్, చిన్నక్క తదితరులు పాల్గొనగా.. చర్లలో జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్, ఎఫ్‌డబ్ల్యూఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.కృష్ణ, జిల్లా కార్యదర్శి తావుర్యా, ఎస్.విజయ కుమార్, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. దుమ్ముగూడెంలోనూ పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ తేదీన శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం 3గంటల నుండి 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డిపో పరిధిలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం తదితర మండలాల్లోని గ్రామాల ప్రజలు బస్సు రాకపోకల సమయాల్లో, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నా.. సలహాలు సూచనలు ఇవ్వదలచినా.. డయల్ యువర్ కార్యక్రమం ద్వారా 9959225963 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

'క్యాట్' పరీక్షపై శిక్షణ

అశ్వారావుపేటరూరల్: క్యాట్ (కంబైన్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్షకు ఏ విధంగా సిద్ధం కావాలనే అంశంపై గురువారం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం ఆధ్వర్యంలో వైజాగ్‌కు చెందిన ప్రముఖ టైం కోచింగ్ సంస్థ ట్రైనర్ చంద్రశేఖర్ ఈ శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా క్యాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీసనింగ్, వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, బోధనా సిబ్బంది డాక్టర్ నీలిమా, డాక్టర్ ఝాన్సీ రాణి, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

'బెస్ట్ రెస్టారెంట్ ఇన్ కోల్‌బెల్ట్' అవార్డ్

మణుగూరుటౌన్: హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ చానల్ నిర్వహించిన ఫుడ్ ఫ్యూషన్ కార్యక్రమంలో గురువారం 'బెస్ట్ రెస్టారెంట్ ఇన్ కోల్‌బెల్ట్'అవార్డును మణుగూరుకు చెందిన వేణు రెస్టారెంట్‌ను వరించింది. హైదరాబాద్‌లో దస్‌పల్లాలో నిర్వహించిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో అతిథిగా హాజరైన తెలంగాణ టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా వేణు రెస్టారెంట్ యజమాని లక్కం లక్ష్మీనారాయణ అవార్డును అందుకున్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

దమ్మపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో గురువారం ప్రారంభించారు. ఈ మేరకు వాస్తుకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి సరిపడా కొలతలతో మ్యాప్‌ను రూపొందించి, తదనుగుణంగా ముగ్గు పోశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ఊరేగింపు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఉన్న దేవాలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ఈ నెల 31న ప్రతిష్ఠించనుండగా.. వాటిని గురువారం ప్రధాన రహదారి, గ్రామ పురవీధుల్లో ఘనంగా ఆట, పాటలతో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద గణపతి పూజ చేసి మధ్యాహ్న సమయంలో విగ్రహాల, ధ్వజస్తంభాన్ని ట్రాక్టర్లలో గ్రామోత్సవాన్ని చేశారు. ఈ సందర్భంగా భక్తులు దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన, అంకురార్పణ పూజలు చేశారు. అలాగే భక్తులు ప్రత్యేక పూజలు చేయగా, గ్రామంలో సందడి నెలకొంది.

అపరిశుభ్రంగా తహసీల్ ఆవరణ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపునీరు



తహసీల్ ఆవరణలో వర్షపు నీటితో నిండిన గుంత

అశ్వాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షపునీరు నిలిచి అపరిశుభ్రంగా తయారైంది. దీనికితోడు వర్షపు నీటితో నిండిన ఓ గుంత తహసీల్ పరిధిలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయం ఎదుట ఉన్న పెద్ద గుంత వర్షపునీటితో నిండిపోయింది. ఆ గుంతలో మురుగునీరు సైతం చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం ఎదుట నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని తొట్టిపంపు గ్రామంలో ఉన్న బాల పెద్దమ్మ దేవత నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామతోరణ అలంకరణ, మహాగణపతిపూజ నిర్వహించారు. దేవత సన్నిధిలో విగ్రహ మూర్తులకు జలాధివాసము చేశారు. హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారగాని శ్రీనివాసరావుతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నైతిక విలువలే లక్ష్యం

బూర్గంపాడు: నైతిక విలువలకు బాటలు వేసి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించటంతో జమాతే ఇస్లామిక్ హింద్ సమ్మర్ క్యాంపు ధ్యేయమని ఆ సంస్థ సారపాక పట్టణ అధ్యక్షుడు జహీర్‌పాషా అన్నారు. గత ఐదు రోజులుగా సారపాకలో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిబిరం ముగింపు సభలో ఆయన మాట్లాడారు.ఈ వేసవి శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులకు ఖురాన్ పఠనం, ప్రవక్త జీవిత విశేషాలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణనిచ్చినట్లు ఆయన తెలిపారు. వేసవి శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. సంస్థ ప్రతినిధులు షేక్ నాగూర్ వలి, షేక్ అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

అశ్వారావుపేటరూరల్: పట్టణంలోని జంగారెడ్డిగూడెం మార్గంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం 21వ వార్షికోత్సవ వేడుకలపే నిర్వహిస్తున్నట్లు షిరిడి సాయిసేవా సమితి అధ్యక్షుడు పంబి హరి తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబాకు శతఘటాభిషేకం, స్వచ్ఛమైన పన్నీరుతో అభిషేకంతోపాటు లక్ష పుష్పాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

తవ్వారు.. వదిలేశారు..



పోస్ట్ ఆఫీస్ మార్గంలో డ్రెయినేజీ నిర్మించేందుకు అడ్డంగా తవ్విన కాలువ

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న డ్రెయినేజీ, రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాజాగా జంగారెడ్డిగూడెం మార్గంలోని పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో పక్షం రోజుల క్రితం డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్వారు. ఆ తర్వాత దుకాణాల ముందు డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టి, పోస్ట్ ఆఫీస్‌కు వెళ్ల మార్గంలో మాత్రం నిర్మించలేదు. దీంతో ప్రతి రోజూ తపాలా కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, సిబ్బందితోపాటు వినియోగదారులు, ఈ ప్రాంత వాసులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టి, ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ ఢీకొని పాడి గేదె మృతి

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ పాడి గేదె మృతి చెందింది. అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతుకు చెందిన మూడు పాడిగేదెలు మూడురోజులక్రితం మేతకు వెళ్లి తిరిగి రాలేదు. కాగా రోడ్డుప్రమాదంలో ఓ గేదె మృతి చెందగా మరోగేదె తీవ్రంగా గాయపడి నడుము విరిగింది. నష్టం రూ.2 లక్షలు ఉంటుందని బాధితరైతు తెలిపాడు.